# కలలో జరిగిన నిజం

సరీగ్గా సాయంత్రం ఆరుగంటలకు హైద్రాబాద్ స్టేషన్ ఎక్స్‌ప్రెస్ ట్రైనును విడిచి పెట్టింది. సెకండుక్లాసులో అప్పర్ బర్తును ఆక్రమించుకొని, ప్రయాణానికి సౌకర్యం సులభంగా ఏర్పడిందన్న దిలాసాతో బర్క్లీ సిగరెట్టు వెలిగించి - వాకిటిలోకివచ్చి నిలబడ్డాడు రవిప్రసాద్.

ఎక్స్‌ప్రెస్ వేగాన్ని అందుకుంటోంది.

రాజధానీనగరం విద్యుద్దీపాల కాంతితో మనోహరంగా వుంది. పబ్లిక్ గార్డెన్ తెల్లగా కాంతితో, రంగురంగుల పువ్వులతో, మనుష్యులతో — 'మళ్ళీ ఎప్పుడొస్తావు?' అని ప్రశ్నిస్తూన్నట్టుంది. దూరాన టాంక్‌బండ్ మీద దీపాలతోరణం — మనో ఫలకంపై అందమైన గీతలు గీస్తున్నాయి.

కాని రవిప్రసాద్ హృదయం బరువుగావుంది. మొట్టమొదటి సారిగా హైద్రాబాద్ చూడటానికి వచ్చిన అతను — ఊహించని అనుభవాన్ని మూటగట్టుకొని, మోయలేని భారంతో ఇంటికి ప్రయాణం చేస్తున్నాడు. సాలార్‌జంగ్ మ్యూజియం, పబ్లిక్‌గార్డెన్సు, గోల్కొండ, హైకోర్టు, చార్మినార్, మక్కామసీదు, హుస్సేన్‌సాగర్, యూనివర్సిటీ, లాండ్‌స్కేప్ గార్డెన్సు చూసిన తృప్తితో కూడుకున్న ఆనందం అతనిలో మిగిలినా—జీవితంలో తొలిసారిగా తటస్థపడ్డ మరికొన్ని కొత్త అనుభవాలు అతని మస్తిష్కపు లేబరేటరీని చీకాకు పర్చాయి.

ట్రైన్ సికింద్రాబాద్ స్టేషన్లో ఆగింది.

రవిప్రసాద్ కాఫీ త్రాగాడు. ఆరోజు సెకండుక్లాసు బోగీ ఏమంత వొత్తిడిగాలేదు. ఒక సిగరెట్టు వెలిగించి, ఏదో మ్యాగజీన్ తిరగవేసి, ట్రైన్ సాగారాక తన బర్త్‌మీద కెళ్ళి పడుకున్నాడు. 'తెనాలి వెళ్ళే సరికి దాదాపు తెల్లవారవచ్చు. అప్పటివరకూ తను సుఖంగా నిద్రపోవచ్చు' అనుకున్నాడు రవిప్రసాద్. కాని నిద్రబోవడం అంత సులభమైన పనికాదు. మనస్సు ప్రశాంతతను కోల్పోయాక నిద్రాదేవి ఆ చాయలకే రాదు ఎంత వేడుకున్నా. ఆల్బర్టు మొరేవియా 'The time of Indifference' నవల తీశాడు — నిద్రపట్టేవరకూ చదువుదామని. కాని రెండు పేజీలు చదివే సరికి – మనస్సు ఆలోచనల చక్రంలో ఇరుక్కుంది ..

'జీవితాంతమూ పవిత్రంగా, నిర్మలంగా, ఆదర్శప్రాయంగా బ్రతుకు దామనుకోనడం అవివేకమేమో! బ్రతుకును కొన్ని సరిహద్దులమధ్య బంధించటం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. జీవితానికి వెలుగునూ, స్థిరత్వాన్ని సమకూర్చే ఆదర్శాలు ఎప్పుడో ఒకప్పుడు మార్గం తప్పుతూనే ఉంటాయి. అట్లాంటప్పుడు మనిషిలో మిగిలేది పశ్చాత్తాపం, సంఘర్షణ, అశాంతి. తను మార్గం తప్పాడు. ఇంతకాలమూ జాగ్రత్తగా పరిరక్షించుకుంటూ వొచ్చిన ఆదర్శాల్ని సహవాసదోషం చాత ఒక్కసారి మలిన పర్చాడు. తన హైద్రాబాద్ రాకే తనలోని చెడుకూ, పాపబుద్ధికి, ద్రోహచర్యకూ నాంది. ఊహకందని దుర్వ్యసనాలకు తను తలవొగ్గాడు. రుచి చూశాడు. జీవితంలో తను నీతిపరంగా ఇంత క్రిందికి దిగజారగల డని ఎప్పుడూ అనుకోలేదు. ఆ గణపతిరావుగాడు లేకపోతే – తను అవినీతికి పాల్పడి వుండేవాడు కాదు. సహవాసదోషం పతనానికి మొదటి మెట్టు అంటారు. తన విషయంలో అక్షరాలా నిజం. గణపతిరావు స్త్రీలోలుడూ, త్రాగుబోతూ, జూదరీ, దుర్వ్యసనాల పుట్ట అని తెలిసి యుండికూడా – వాడివెంట హైద్రాబాద్ చూడటానికి రావడమేమిటి? తను ఆదిలోనే తప్పటడుగు వేశాడు.

'వాడి ప్రోద్బలంవల్లనే —'హోటల్'లో దిగడం జరిగింది. పెద్ద హోటలు - సౌకర్యాలు బాగానే ఉన్నాయి. ఆరోజంతా టాక్సీలో

నగరమంతా తిప్పాడు. చూడవల్సిన స్థలాల నన్నింటినీ చూపెట్టాడు సాయంత్రం ఎగ్జిబిషన్ కుకూడా తీసికెళ్ళాడు. అంతవరకూ తను గణపతిని మెచ్చుకుంటూనే వున్నాడు. తిరిగి హోటలుకు వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది.

"బార్ కు వెళదామా ?" అన్నాడు వాడు చిరునవ్వు నవ్వుతూ.

గతుక్కుమన్నాడు తను. పేరు వినటమేగాని తను ఎన్నడూ వెళ్ళ లేదు. పైగా వాసనగూడ యెరుగడు. ఆ విషయాల్లో తను నిప్పులాంటి మనిషని వాడికి తెలుసు. అట్లా ఎందుకు అడిగాడు ? తనకి వొళ్ళు తెలి యని కోపం వచ్చింది.

"అట్లాంటి పిచ్చిపిచ్చి వేషాలు నాదగ్గర పనికిరావు". అన్నాడు తను కఠినాతికఠినంగా

గణపతి పెద్దపెట్టున నవ్వాడు.

"పిచ్చి పిచ్చి వేషాలేముందోయ్ ! జీవితంలో మనకుగల పరిమిత కాలంలోనే అన్ని సౌఖ్యాల్నీ అనుభవించాలి. అనుభవానికి మంచేమిటి ? నీతి ఏమిటి ? అవినీతి ఏమిటి ? పాపమేమిటి ? పుణ్యమేమిటి ? సుఖము సుఖమే ! జీవితం సుఖంగా జీవించటానికే ! ప్రతివ్యక్తి సుఖాన్వేషణ కోసమే జీవితంలో ఎక్కువకాలం వినియోగిస్తాడు. సుఖం లభించని తరు ణంలో మానవుడు సంఘపు కట్టుబొట్లకు భయపడడు. లక్ష్యపెట్టడు. మనస్సు నెప్పుడూ లోభివాని ఇనుపపెట్టెవలె జాగ్రత్తతో బంధించ రాదు. దానికి పూర్తి స్వేచ్ఛ నివ్వాలి. జీవితంలో పిచ్చిపిచ్చి ఆదర్శాల్ని ఏర్పాటు చేసుకొని, కోర్కెల్ని బలవంతాన అణచుకుంటూ, అందమైన అనుభూతులు లేకుండా నీరసంగా, నిస్సత్తువగా బ్రతకడంలో గొప్ప ఏముంది ? అన్ని అలవాట్ల సారమే జీవితమంటే! చెప్పు ఏ బార్ కు వెళదాం ? క్వాలిటీయా, మంజూకా, శవాయ్ కా ...!"

తను ఎంత కాదన్నా వాడు విడిచిపెట్టలేదు. అయితే యేం ? తను బార్ కు వెళ్ళలేదు. వాడు రూముకే తెప్పించాడు — కింగ్ పిషర్ కోల్డు బీరూ, జానీవాకర్ రెడ్ లేబుల్ విస్కీ, హావర్డ్సు జిన్. వాటిని తాకే

ముందు ఆత్మలో ఎంతో సంఘర్షణ జరిగింది. 'ఇదే మొదటిసారి, ఇదే ఆఖరుసారి' అన్న ఉద్దేశ్యంతో తను వాటిని రుచి చూశాడు. విస్కీ త్రాగుతూంటే గొంతంతా చేదుగా మండిపోయింది. ఓ గ్లాసు 'కాక్ టెయిల్' తయారు చేశాడు గణపతి. ఆగ్లాసు పుచ్చుకున్న తర్వాత గానీ — తనకి నిషామజా తెలీలేదు. శరీరమంతా గాలిలో గడ్డిపోచలా తేలిపోతూండగా-తియ్యని మత్తుతో పడుకున్నాడు తను. గణపతి బయటకెళ్ళి పదినిముషాల్లో తిరిగివచ్చాడు సీతాకోక చిలుకను వెంటబెట్టుకుని. నిద్రకు సిద్ధంగావున్న కనురెప్పలు ఒక్కసారి నిక్కబొడుచుకున్నాయ్. గణపతి నవ్వుతూ, "ఆ అనుభవానికి తగిన విలువ చేకూరాలంటే ఈ అనుభవంకూడా వుండాలి బ్రదర్" అంటూ గది బయటకు తప్పుకున్నాడు. ఆమె ఎంతో పరిచయం వున్నదానివలె నవ్వుతూవచ్చి తన ప్రక్కమీద కూర్చున్నది. తనకెందుకో అసహ్యమేయలేదు. తన మంచితనం, నిర్మలత్వం, ఆదర్శాలు, ప్రవర్తన యొక్క పవిత్రత—ఏమైనాయి? ఆత్మ మూసినకన్ను తెరువలేదు. మనస్సు ఉద్రేకంతో కప్పిగంతు లేసింది. ఆరాత్రి ఆమెతోటి అనుభవం జ్ఞాపకం పెట్టుకోతగ్గ మధురమైన అనుభవం ...

కాని ఛీ, ఛీ, తనెంత అవినీతికి పాల్పడ్డాడు? ఎంత నైచ్యానికి దిగజారాడు! ఏం చేయాలి. అపచారం జరిగిపోయింది. తన ప్రవర్తనపట్ల జరిగిన అగ్ని పరీక్షలో తను చిత్తుగా ఓడిపోయాడు. తనకి ఆత్మబలం లేదు. మనోదారుఢ్యత లేదు. ఇంతకాలమూ చెడును అంటకుండా బ్రతుకుతూ వస్తూన్నాడు తను అన్న సంతృప్తి కేవలం ఆత్మవంచనే! ఇంటికి వెళ్లి సరోజకు ముఖ మెట్లా చూపెట్టడం? మద్యపానాన్ని సేవించడమూ, పరస్త్రీ సాంగత్యాన్ని పొందడమూ - జీవితంలో మొట్టమొదటిసారిగా చేసిన ఈ రెండు తప్పుల్ని సరోజ సహిస్తుందా? ఆమెకు తెలిస్తే - ఆత్మహత్య చేసికోదూ! భర్తయొక్క అవినీతిని ఎంతమంది భార్యలు నిశ్శబ్దంగా యిముడ్చుకోగలరు? సరోజ అట్లా నిశ్శబ్దంగా జీర్ణించుకోలేదు. మనుష్యుల మధ్య నీతి అవినీతులు, సామాజికవిలువలూ, జారిపోయే మనస్తత్వాలూ, తాత్కాలికపు సర్దుబాట్లూ — వీటిపట్ల ఆమె అభిప్రాయాలు నిశ్చలమైనవి. తనకు తాను సమాధానం చెప్పుకొని తృప్తిపడలేదు. ఏం చేయాలి తను? ఆమెకు ఎప్పటికైనా తెలియకుండా వుంటుందా?

అప్పుడైనా తన అవినీతి, దోషం, ద్రోహం - బయట పడకుండా వుంటాయా ? అందుచాత తను ఇంటికి వెళ్ళాక చేసిన నేరం ఆమెకు చెప్పి- క్షమాపణ కోరుకుంటే ! 'మళ్ళీ జీవితంలో ఎప్పుడూ అట్లాంటి నీచపు పనుల్ని చేయను' అని ప్రమాణం చేస్తే ఆమె క్షమించ కేమిచేస్తుంది ? అప్పుడు తన ఆత్మకు శాంతి లభిస్తుంది. అప్పటివరకూ తనలో యీ సంఘర్షణ తప్పదు ! తాము చేసిన తప్పుల్నీ, అత్యాచారాల్నీ, అవినీతిపనుల్నీ - ఎంతమంది మగవాళ్లు తమ భార్యలకు సవిస్తరంగా చెబుతున్నారు ? ఆ విషయాల్లో స్త్రీల నెప్పుడూ దూరంగా, అజ్ఞాతంగా అట్టేపెట్టి - వాళ్ళల్లో అనుమానపు వ్యాధుల్నీ, మనోవ్యధల్నీ కలుగజేస్తూ దాంపత్యాల్ని నరకం చేయటమేగా మగవారి నైజం ! ఈ విషయంలో తను నిజాయితీగా ప్రవర్తించాలి. తెలిసో తెలియకో, పరిస్థితుల ప్రాబల్యంచేతనో, మరే కారణం చేతనో భర్తగానీ, భార్యగానీ జీవితంలో -- తప్పుల్ని చేయవచ్చు; అవినీతికి పాల్పడవచ్చు; పాపకార్యాలకు లోనుకావచ్చు వాటిని ఒకళ్ళకు తెలియకుండా మరొకళ్లు దాచిపెట్టడంలో - ఎప్పటికైనా ప్రమాదాలున్నాయిగానీ, దాంపత్యనౌక సాఫీగా సాగిపోదు. కాని ఒకళ్ళ తప్పుల్ని మరొకళ్లు, ఒకళ్ళ అవినీతిని మరొకళ్ళు, నిష్కల్మషంగా చెప్పుకొని - మనసుల్ని నిర్మలం చేసుకుంటే, పొరపులూ, ప్రమాదాలూ పోట్లాటలూ వుండవు. ఎంత బాధపడినా - తను చేసినతప్పుల్ని చెప్పవల్సిందే ! తననిగురించి ఆమె ఎట్లాగైనా అభిప్రాయాల్ని ఏర్పర్చుకోనీ .. అట్లా ఆలోచిస్తూ రవిప్రసాద్ క్రమంగా గాఢనిద్రకు గురయ్యాడు.

ఎక్స్‌ప్రెస్ చీకటిని చీల్చుకుంటూ పోతూ నేవుంది.

* * *

పాలవర్షంవలె కురుస్తోంది మంచు నిశ్శబ్దంగా. జి. టి. ఎక్స్‌ప్రెస్ క్రిష్ణాబ్రిడ్జిమీద వెళుతూ చేసే చప్పుడుకు చటుక్కున నిద్ర మెలుకువ వచ్చింది రవి ప్రసాద్‌కు. 'అరే! తెనాలి వచ్చేస్తూన్నది' అనుకుంటూ గబ గబ సర్దుకున్నాడు.

తెల్లవారుఝామున నాలుగున్నరకు ఎక్స్‌ప్రెస్ తెనాలి స్టేషన్లో ఆగింది. రవిప్రసాద్ గబుక్కున దిగాడు పెట్టె బెడ్డింగుతోసహా. స్టేషన్

బయటకొచ్చి రిక్షాయెక్కాడు. దట్టంగా పట్టిన మంచుకు విద్యుద్దీపాల కాంతి మందంగా వుంది. వీథులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. చలి శరీరాన్ని గడగడ లాడిస్తున్నది.

రిక్షాదిగి రవిప్రసాద్ వీథివాకిట్లోకి వెళ్ళాడు. కొంచెందూరంగా కౌన్సిలర్ సుబ్బయ్య డాబా ముందున్న వీధి దీపపుకాంతి అంతవరకూ ప్రాకులాడలేకపోతోంది. వీధి అరుగుమీద ఓ నల్లకుక్క మూడు అంకె వేసి ముడుచుకు పడుకునివుంది. తలుపు తట్టుదామన్న రవిప్రసాదు ఆ తలుపు ఓరగా తీసివుండడాన్ని చూసి - అత్యాశ్చర్య చకితుడైనాడు. 'వీధితలుపు వేసుకోకుండా సరోజ యెట్లా పడుకుంది?' అనుకుంటూ ఇంటి వరండాలోకి వెళ్ళాడు. తలుపు మెల్లగా తట్టాడు. "సరోజా! సరోజా!" కేక వేశాడు.

పడకగదిలో లైటు వెలిగింది.

కొంచెం సేపటికి పెరటిదొడ్డితలుపు తీసిన శబ్దం వినవొచ్చింది.

రవిప్రసాద్ మనస్సు రెపరెపలాడింది.

గుండె బరువుగా కదులాడింది.

వొళ్ళంతా అదో రకమైంది.

కొన్నిక్షణాల తర్వాత సరోజ ఇంటితలుపు తీసింది. అప్పుడే నిద్ర లేచిన మత్తు వొదలనట్టుగా ఆవలిస్తూ, వొళ్ళంతా విరుచుకుంటూ "జి. టి. కొచ్చారా?" అన్నది.

దూరంగా యెక్కడో కోడికూసింది.

రవిప్రసాద్ హృదయంలో హఠాత్తుగా అనుమానపు గుట్ట యేర్పడింది.

ఇంట్లోకి వెళ్ళి, తలుపు గడియబెట్టి, కిటికీలోంచి బయటకు చూశాడు. యేదో చప్పుడైంది. మెల్లగా, పెరటిదొడ్లోంచి తెల్లదుస్తులు ధరించిన ఓవ్యక్తి - గబగబా నడుస్తూ వీధి వాకిటినుంచి వెళ్లాడు. కళ్ళారా ఆదృశ్యాన్ని చూసిన రవిప్రసాద్ మెదడు బండబారినట్లయింది. తల

ఇనుపసూలానికి కొట్టుకున్నట్టుగా దిమ్మెత్తిపోయింది. కాని ఆ వ్యక్తిని గుర్తు పట్టలేకపోయాడు.

నిద్రమత్తు పూర్తిగా వదలనట్టు సరోజ పడకగదిలోకొచ్చి పడుకున్నది.

దూరంగా కోడికూత మళ్ళీ వినిపించింది.

రవిప్రసాద్ పిచ్చికోపంతో గింగిరాలు తిరిగిపోయాడు. ప్రపంచ మంతా పాపభూయిష్టంగా అవినీతిగడ్డగా కనిపించింది. ఉన్మాదచిత్తుడై మానవత్వాన్ని కోల్పోయిన ప్రళయకాల భీకరుడై - పడకగదిలో కొచ్చాడు. పెరటిదొడ్డివైపు తలుపు గడియ తీసేవుంది. సరోజ అవినీతి బుద్ధి బోధపడింది.

నిద్రనటిస్తూవున్న భార్యను జుత్తు పట్టుకొని క్రిందకు యీడ్చి, చెంప లపై బలంగా కొట్టాడు.

'ఎవడే నీ పడకగదిలో ఇప్పటివరకూ పెట్టుకొని వులికావు? ఎవడే వాడు! ఎన్నాళ్ళనుంచి సాగుతుందీ వ్యవహారం! చెప్పు! నిజంచెప్పు! లేకపోతే చంపేస్తాను. నన్ను హైద్రాబాద్ పోనిచ్చి, ఇక్కడ నీ అవినీతి సాగిస్తున్నావా? ఎంతనీచానికి పాల్పడ్డావు? ఇన్నాళ్ళనుంచీ కనబర్చిన అణకువ, వినయమూ, ప్రేమా, అభిమానమూ, పతిభక్తి, అంతా నట నేనా! నాకళ్ళల్లో కారం జల్లడానికే! చూడు, నిన్నేం చేస్తానో! చెప్పు? ఆ దుర్మార్గు డెవడో!'

సరోజ మారుమాట్లాడకుండా, ఏడుస్తూ కన్నీటికాలువను ప్రవ హింపజేసింది.

'ఛీ-ఛీ-ఛీ! తను సరోజను కొట్టడ మేమిటి? ఆమె అవినీతికి పాల్పడ వచ్చు. తన పరువు ప్రతిష్ఠల్ని మంటగలుపవచ్చు. కాని ఆమెను కొట్ట టానికి తనికి అర్హతలేదు. తను హైద్రాబాదులో చేసివచ్చిన పనేమిటి? అక్కడ తను అవినీతికి పాల్పడలేదా? అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకున్న భార్యకు పరస్త్రీ సాంగత్యం ద్వారా ద్రోహం చేయలేదా? తను నీతి గలవాడా? తన ప్రవర్తన న్యాయసమ్మతమా? తన హృదయం మాలి

న్యాయ్యం కాదూ! అట్లాంటప్పుడు తను ఆమె అవినీతిని గర్హించాల్సిన పనేముంది? భార్యాభర్తల్లో ఎవ్వరు అవినీతికి గురైనా - వచ్చే అపకీర్తికి బాధ్యులు ఇరువురుగదా! కాని...కాని...ఎట్లా సహించటం? తనది అట్లాంటి విశాలహృదయమా? భార్య నైతికపతనాన్ని కళ్లారాచూసి, ఎట్లా సరిపెట్టుకోవడం! అసంభవం! తనవల్లకాదు. అయితే, ఏం చేయాలి? ఏం చేయాలి?' అనుకుంటూ త్రుళ్ళిపడి లేచాడు నిద్రనుంచి రవిప్రసాదు.

*　　　*　　　*

'కాఫీ' గరమ్ గరమ్ ఛాయ్!' 'వేడివేడి ఇడ్లీ' 'పూరీకూరా!' వడ, సిగరెట్, పందుంపుల్లలు, రిబ్బన్లు, దువ్వెన్లు — మొదలైన కేకలతో, ప్రయాణీకుల సందడితో విజయవాడ స్టేషనంతా కోలాహలంగా వుంది.

రవిప్రసాదు లేచికూర్చుని, తుండుగుడ్డతో ముఖం తుడుచుకుని - రిస్టువాచీకేసి చూసుకున్నాడు. మూడుగంటల నలభై అయిదు నిముషాలు.

'ఛీ,-ఛీ, యెంత చెడ్డకల వొచ్చింది?' అనుకున్నాడు అప్పర్ బర్తు నుంచి క్రిందకు దిగుతూ.

'అట్లా యెన్నటికీ జరుగరాదు. కల నిజమవుతుందా? కాదు. సరోజ మంచిది. ఏమో! తెల్లవారుఝామున వొచ్చినకలలు నిజమవుతాయంటారు! వొఠిదే! అన్ని కలలూ నిజమవుతాయా! తనకొచ్చిన కలమాత్రం నిజం కాకూడదు! కాదుకూడా! సరోజ బుద్ధిమంతురాలు. శీలవతి. శిష్టస్వభావి. సద్గుణసంపన్నురాలు. తను చికాకుపడనక్కరలేదు. భయపడే అగత్యంలేదు' అనుకుంటూ ప్లాట్ ఫారంమీదకొచ్చి కాఫీత్రాగి, సిగరెట్టు వెలిగించాడు రవిప్రసాదు.

తెల్లవారుఝామున నాలుగూముప్పావుకు జి. టి. ఎక్స్‌ప్రెస్ తెనాలి స్టేషనులో ఆగింది. భయపడుతూనే దిగాడు ప్రసాదు.

మంచు దట్టంగా టవున్ను ఆవరించింది. రిక్షాలో ఇంటికి వెళ్ళాడు.

వీధితలుపు వేసేవుంది. తలుపుతట్టి భార్యను కేకలువేశాడు. నాలుగు కేకల అనంతరం సరోజ పలికి, తలుపు తీసింది. ఆమెకేసి పరిశీలనగా చూశాడు. ఆమె గమనించలేదు.

పడకగదిలోకి వెళ్ళాడు రవిప్రసాదు. పెరటిదొడ్డివైపు తలుపు గడియపెట్టి వుంది. అతని ప్రాణం కుదుటపడింది. 'ఛీ, ఛీ వెధవకల. అనవసరంగా తను చీకాకుపడ్డాడు' అనుకున్నాడు.

బెడ్ లైట్ కాంతిగా వెలుగుతోంది.

బయట తలుపు గడియపెట్టి సరోజ పడకగదిలోకి వచ్చింది. ఆమె ముఖం వొదలని నిద్రమత్తులో అమాయకత్వాన్ని తొణికిస్తూ ముచ్చటగా వుంది. నిద్రకు రేగిన వెంట్రుకలు, నలిగినచీరె, కనురెప్పలచుట్టూ జారిన కాటుకా, బద్ధకం తీరని వొళ్లూ - రవిప్రసాదు సందేహం తీరిన నూతనో త్సాహంతో, క్రొత్త ఉద్రేకంతో సరోజను దగ్గరకు తీసికొని, బిగియార కౌగిటిలో చేర్చుకొని, గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.

భర్త పరిష్వంగంలో రబ్బరు బొమ్మయైన భార్య - గోరువెచ్చని నిట్టూర్పు విడిచి, తన్మయత్వాన్ని తనివితీరా పొందింది.

హైదరాబాదు వెళ్ళివచ్చినదగ్గరనుంచి రవిప్రసాదు ముభావంగా వుంటున్నాడు. యెన్నడూలేని 'సీరియస్ నెస్' అతని ముఖాన్ని పట్టుకు వ్రేలాడటం సరోజకు పెద్ద ఆశ్చర్యాన్ని గొల్పింది. ఆమెతో ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు, సహజంగా చిరునవ్వు నవ్వలేకపోతున్నాడు. భోజనంకూడా సరిగ్గా చేయడం లేదు. అంతకుముందు గంట గంటకు కాఫీ త్రాగేవాడు. అటువంటిది, "ఏమండీ! కాఫీ ఇవ్వమంటారా?" అని సరోజ అడిగితే తప్ప మాట్లాడటంలేదు. గొలుసుకట్టుగా సిగిరెట్లు కాలుస్తున్నాడు. ఏదో అమూల్యమైన వస్తువును పోగొట్టుకున్నట్టూ, జీవి తంలో ఆశించిన విలువలు అందకుండా జారిపోయినట్టు, భవిష్యత్తు నిరాశావృతమైనట్టూ - బాధాకరంగా ఆలోచిస్తూన్నట్టు కనబడుతూన్నది.

భర్తలోని మార్పును సరోజ గుర్తించింది. కాని ఆమార్పుకు మూలాన్ని గ్రహించలేకపోయింది. అయిదేళ్ళకాపురంలో భర్తను అట్లాంటి మానసిక అస్వస్థతలో ఆమె చూడలేదు. అందువలన కొంచెం గాభరాపడింది.

ఏవిషయాన్ని గురించి భర్త అంతగా దిగులుపడుతున్నాడో తెలుసుకు నేందుకు శతవిధాలా ప్రయత్నించింది.

ఒకరోజు సాయంకాలం కాలేజీనుంచి వొచ్చాక రవిప్రసాదు ఇంటి వరండాముందు పడకకుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. భర్తకు కాఫీయిచ్చి - ప్రక్కన నిలబడింది సరోజ.

సాయంత్రపుయెండ పసివాని నవ్వు మాదిరిగా ప్రశాంతంగా ఇంటి వరండా ముందు పూలచెట్లపై పడుతూన్నది. ప్రక్కవాళ్ళ ఇంటిలోనుంచి రేడియోలో అగవపాటలు సన్నగా వినిపిస్తూన్నవి.

భర్త ఖాళీచేసినకప్పూ, సాసర్నూ అందుకుంటూ - "మీరింత నిగూఢమైన వ్యక్తులని అనుకోలేదు'' అన్నది సరోజ గంభీరంగా.

విచలితుడై రవిప్రసాదు భార్యకేసి సాలోచనగా చూశాడు.

'హైదరాబాదునుంచి వచ్చినప్పటినుంచీ మీలో యెంతోమార్పు కనబడుతోంది. ఆ మార్పుకు కారణం తెలిసికోవచ్చునా ? ఏచిన్న సమస్య వొచ్చినా నాతో చెప్పనిదే ఆలోచనకు పూనుకోనేవారుకాదు. అలాంటి వారు నా ప్రమేయం లేకుండానే గంటలతరబడి ఏకాంతంగా ఆలోచించు కుంటూ మీలోమీరు బాధపడుతున్నారు. కష్టాలకూ, సుఖాలకూ, సంకీర్ణ సమస్యలకూ, లోతైన ఆలోచనకూ - సగభాగం పంచుకోగల అర్ధాంగిని నేనున్నానుగదా! నాతో చెప్పకూడదా ? మీకొచ్చిన ఇబ్బందు లేమిటో ?'

'సరోజా ! .. నీ మంచితనం, సహృదయతా, శిష్టస్వభావుకతా చూస్తుంటే — ఆత్మహత్యచేసికోకుండా యెందుకు బ్రతికున్నానా అని పిస్తోంది.'

ఆమాటలకు సరోజ భయోద్విగ్నచిత్తయై ఒక్కసారి నిలువెల్లా కంపించిపోయింది.

'నిచ్చెన యెక్కడం కష్టంగానీ - జారిపడడం తేలిక; కొండ యెక్కడం శ్రమగానీ - క్రిందకు దొర్లడం సులభం. జీవితంలో మంచి పేరు సంపాదించడం కష్టమూ, శ్రమతో కూడుకున్న పనిగానీ - చెడ్డపేరు

తెచ్చుకోవడం తేలికా, సులభమూను. భగవంతుడు మనుషులకు 'ఆత్మ' అనే పదార్థాన్ని యింత మెతకగా యెందుకుపెట్టాడో! పరిస్థితులకు ఇట్టే లొంగిపోయేతత్వాన్ని మనుష్యుల కెందుకు కల్పించాడో! జీవితంలో దృఢమైన నిర్ణయాలు చేసుకున్నవారే, నీతిని గురించి, సాంఘిక వ్యవస్థను గురించి పదును గల అభిప్రాయాలు గలవారే - తమ మార్గంనుంచి అన్యాయంగా జారిపోవడం కద్దు. నా కట్లాంటి దురవస్థ పట్టింది సరోజా! నువ్వు నమ్మలేవు. నాకే నమ్మకం లేదు - అటువంటి నీచస్థితికి దిగజారానంటే! కాని అపచారం జరిగిపోయింది. అక్షరాలా అధఃపతనాన్ని పొందాక.' ఆ తర్వాత రవిప్రసాదు తను హైదరాబాదు జీవితంలో మొట్టమొదటిసారిగా చేసిన తప్పుల్ని సవిస్తరంగా చెప్పి, కళ్ళల్లో నీళ్ళు బార చివరకిలా అన్నాడు:

'సరోజా! నన్ను క్షమించు. చేసిన తప్పులకు అశాంతితో, పశ్చాత్తాపాగ్నితో, తీవ్రమైన మనోవ్యథతో క్రుంగిపోతున్నాను. నువ్వు క్షమించడం కంటె నాయీ పాపకార్యాలకు నిష్కృతిలేదు. నాయీ దుశ్చేష్టల్ని సహనంతో, సహృదయంతో, నువ్వు జీర్ణించుకొని - క్షమాభిక్ష పెట్టకపోతే, నేనేమౌతానో నాకే తెలియదు'.

సరోజ నిలువునా నిర్విణ్ణురాలైంది. కొన్ని క్షణాలపాటు అచేతనావస్థలో వుండిపోయింది. ఆమెనుచూచి రవిప్రసాదు కలవరపడ్డాడు.

ఆపైన సరోజ నిర్లక్ష్యమైన చిరునవ్వును పెదాలపై కనబర్చగా - రవిప్రసాదు అయోమయస్థితిలో కొట్టుకులాడాడు.

'మీరెంత నిష్కల్మషహృదయులు! నిజాయితీపరులు! మీ హృదయపుటౌన్నత్యమూ, నిర్మలత్వమూ, ఆత్మవిశాలత్వమూ - నా ఊహాపథాలకు అందనటువంటివి. భార్యాభర్తల్లో తప్పులు చేస్తేమట్టుకు నిజాన్ని చెప్పుకొనే ధైర్యసాహసాలూ, నిజాయితీ, నిర్భయతా ఎంతమందికుంటాయి? మీరు నాకెంతో నచ్చారు' అన్నది సరోజ ముఖంలో గంబీరమైన ప్రశాంతతను ప్రకటిస్తూ.

రవిప్రసాదు ఇనుమిక్కిలిగా సంతోషించాడు.

కాని సరోజ హృదయాంతరాళాల్లో సాగుతూన్న తీవ్రమైన సంఘర్షణ అతని కేం తెలుసు ?

ఆనందోద్రేకంతో శరీరం సంపులకితంకాగా, రవిప్రసాదు భార్యను దగ్గరకు తీసుకొని - పడకకుర్చీలో, వొళ్ళో కూర్చోబెట్టుకొని, ఆమె చెంపల్ని, పెదాల్ని, నునునూ, గుండ్రటి కంఠాన్నీ మృదువుగా నిమిరాడు.

సరోజ నేత్రాల్లో నీళ్లు తెరలు తొలగించుకొని బయటకొచ్చాయి. అవి ఆనంద బాష్పాలు కాబోలు !

'ఒకళ్ళకొకళ్ళం అహర్నిశలూ నిష్కల్మషంగా వుందాం సరోజా ! అన్నాడు రవిప్రసాదు హృదయంలో రాగోదయం ఎర్రబడగా.

సరోజ పైటచెంగుతో చాటుగా కళ్ళు అద్దుకున్నది.

* * *

చేసినపాపం చెబితేనేగాని పోదంటారు. అట్లాగే తను చేసిన తప్పుల్ని, వేసిన తప్పటడుగుల్నీ - భార్యతో చెప్పడంద్వారా రవిప్రసాదుకు హృదయభారం తగ్గింది. కాని అది తాత్కాలికమే ! ఆరోజునుంచీ సరోజలో వొచ్చిన మార్పుల్ని గమనిస్తూ - అతను భయపడిపోయాడు. తను నిజాన్ని చెప్పడంవల్లనే, తను చేసిన నీతిబాహ్యములైన పనులకూ రవిప్రసాదు కారణాల్ని గ్రహించాడు. అన్నింటికీ మూలం హైద్రాబాదులోని తన అవినీతిచేష్టలూ, వాటిని ఆమెకు నిష్కల్మషంగా తెలియజెప్పటమూ. భర్తలను గురించి కొన్నిరహస్యాలు భార్యలకు తెలియకుండా వుండటమే మంచిదేమో ! అజీర్ణవ్యాధితో బాధపడేవాళ్ళకు కొత్తకొత్త వంటకాలు పెట్టడం - ఆవ్యాధిని ద్విగుణీకృతం చేయడమేగా !

ఆరోజు పదిగంటలకు కాలేజీకి వెళుతూ గదిలో పడకకుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తూన్న సరోజ దగ్గరకు వచ్చాడు రవిప్రసాదు. భర్తను మాసికూడా చూడనట్టుగా అచేతనంగా ఆలోచనలో నిమగ్నురాలైంది.

సరోజా! నీ పరిస్థితి చూస్తుంటే రోజురోజుకి నాకు భయమేస్తున్నది. ఏదో జరిగింది జరిగిపోయింది. పశ్చాత్తాపపడ్డాను. పరివర్తన తెచ్చుకున్నాను. ఆవిషయాన్నిగురించి నువ్వింతగా దిగులుపడటం భావ్యం కాదు. నన్ను నమ్ము. నామీద ఆపాటి విశ్వాసం లేదా? ప్రతిజ్ఞాపూర్వకంగా ప్రమాణంచేసి చెబుతున్నాను. జీవితంలో మళ్ళీ అటువంటి అవినీతికి, నైచ్యానికి పాల్పడను' అన్నాడు రవిప్రసాదు ఆవేశంతో కూడుకున్న ఉద్రేకంతో.

సరోజ నేత్రాలు సజలపూరితాలైనాయి.

ఏం మాటలాడలేదు. ఆమె.

'హృదయం లేని వ్యక్తి' అనుకుంటూ రవిప్రసాదు కాలేజీకివెళ్ళాడు సైకిలెక్కి.

కాలేజీకి వెళ్ళినా రవిప్రసాదు హృదయానికి రవ్వంత శాంతి చిక్కలేదు. మనస్సంతా ఇంటివద్ద భార్య అయోమయ పరిస్థితిపైనే లగ్నమై వుంది. తను తప్పులు చేశాడు. ఆ తప్పులు చేయటానికి పరిస్థితులు అట్లా పడదోసికొనివచ్చాయి. తప్పుచేయటం మానవునికి అసహజంకాదు. కాని చాలమందికి మల్లే ఆతప్పుల్ని తను దాచిపెట్టలేదు. తప్పుల్ని తెలిసికొని, పశ్చాత్తాపాగ్నిలో మాడిపోయి, పరివర్తనచెంది, ఆమెతోనే చెప్పాడు - నిష్కృతికోసం. ఆ తప్పుల్ని ఆమె సహృదయంతో తీసికున్నట్టుగానే కనబడింది. "భార్యాభర్తల్లో తప్పులుచేస్తేమాత్రం నిజాన్ని చెప్పే ధైర్యసాహసాలు, నిజాయితీ, నిర్భయతా ఎంతమందికుంటాయి? మీరు నాకెంతోనచ్చారు'' అన్నదిగదా! మరి యీ అర్థంగాని పరిస్థితేమిటి? 'స్త్రీహృదయం అంతుతెలియని అగాధం - అభేద్యం' అంటారు. సరోజ హృదయం కూడా అటువంటిదేనా?

రవిప్రసాద్ ఇంగ్లీషు డ్రామాక్లాసుకు వెళ్ళాడు. షెరిడాన్ 'రైవల్సు' నాలుగులైనులు చదివాడు. కానీ - ఆపైన ముందుకు సాగలేదు. మనస్సంతా ఇంటిదగ్గర భార్యను గురించిన ఆలోచనలోనే ఇరుక్కుపోయింది.

పుస్తకం మూసేసి, విద్యార్థుల్ని నిశ్శబ్దంగా చదువుకోమన్నాడు ఆపీరియడంతా.

మధ్యాహ్నం యింటర్వల్లో ఇంటికి వెళ్ళేందుకు నిశ్చయించుకొని, తల నొప్పిగా వుండడంవల్ల సెలవు పెట్టడమైందని సెలవు చీటీ వ్రాసి, సైకిలెక్కి ఇంటికి బయల్దేరాడు రవిప్రసాద్.

త్రోవలో కొత్తవంతెనవద్ద పనిమనిషి రాముడు ఎదురైనాడు. వాడు అయ్యగారి కోసం ప్రాణాలు గొంతులోకి వచ్చేట్టు పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. అయ్యగార్ని చూసి ఆగిపోయాడు. రవిప్రసాద్ ఆదుర్దాగా సైకిలు దిగాడు. 'ఏమిట్రా ?'

'అమ్మగారు బావిలో పడ్డారు. చాలసేపటివరకూ ఎవరూ చూడలేదు. చివరకు...'

రవిప్రసాద్ సైకిలెక్కి వొంట్లోవున్న బలంకొద్దీ వేగంగా త్రొక్కి ఇంటికి వెళ్లాడు.

రవిప్రసాదు వీధివాకిటిముందు నురుగులు కక్కుకుంటో సైకిలు దిగేసరికి – ఇంటిలో జనం నిండుగావున్నారు. డాక్టరుకూడా రావడం జరిగింది.

బావిలోంచి తీయబడిన సరోజకు స్పృహ లేదు.

కొంతమంది త్రాగిననీటిని కక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు.

డాక్టరు ఆమెను పరీక్షించి – క్రింది పెదవి నెమ్మదిగా విరిచి, 'లాభం లేదు. చనిపోయింది' అన్నాడు.

అక్కడున్నవాళ్ళంతా ఒకళ్ళముఖాలొకళ్లు చూసుకున్నారు – ఆశ్చర్యం కూడుకున్న విషాదంతో.

రెండుచేతుల్నీ నడుంమీద పెట్టుకొని, గాలి స్తంభించగా తలవంచి నిలబడ్డ చెట్టుపగిది – సరోజ శవంముందు నిలబడ్డ రవిప్రసాదు, గుండె దుఃఖోద్వేగంతో గుంజీలు తీస్తూండగా డాక్టరు మాటల్ని విన్నాడు.

'తనే ఆమెను చంపాడు! సరోజ మరణానికి కారణం తనే!' అనుకున్నాడు దుఃఖం శరీరాన్ని ఆవరించగా.

కాలేజీ లెక్చరర్ రవిప్రసాదు భార్య దారుణంగా ఆత్మహత్య చేసుకున్నవార్త ఆ పేటంతా నిముషాల్లో సోకగా, చూడటానికి జనం విరివిగా రాసాగారు.

కొంతమంది దహనసంస్కారాల కేర్పాట్లుచేయ మొదలెట్టారు.

మధ్యాహ్నపు ఎండ అసూయాపరుని హృదయంలోని మంట మాదిరి మండుతూన్నది.

రవిప్రసాదు వరండాలో బల్లపై కూర్చుని కోపోద్విగ్న మనస్కుడై అచేతనావస్థలో వున్నాడు. అతను ధరించిన స్నోవైట్ టెర్లిన్ స్లాకూ, బ్లూకలర్ ప్యాంటూ, ఎంబాసిడర్ బూటూ - సానుభూతిగా కన్నీళ్ళు కారుస్తున్నాయి.

వీధివాకిటిలో నిలబడి దూరంగా సరోజ శవంకేసి చూస్తున్న ఓ కొత్తవ్యక్తిపై రవిప్రసాదు చూపులు హఠాత్తుగా మళ్ళాయి. అతని వొడ్డూ, పొడుగూ, ఆకారమూ - అస్పష్టమైనరూపం మనస్సులో వెనక్కు నడిచాయి.

చివుక్కున లేచాడు. రవిప్రసాదు - సత్యాన్ని పరిశోధించిన ఆవేశం కొద్దీ.

వీధివాకిటిలో నిలబడ్డ ఆ కొత్తవ్యక్తి గబుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళిపోయేతీరు రవిప్రసాదులోని అస్పష్ట సందేహ రూపానికి స్పష్టతను చేకూర్చింది.

"అవును, వాడే...వాడే... వీడు! ఆరోజు రాత్రి మైటినులో తను కన్నది కలకాదు ..!" అనుకున్నాడు రవిప్రసాదు. ఆపైన అతని పెదాల పైన విషాదాన్ని తొలగించుకొని - ఓ దరహాసం దోరగా కదులాడింది.

'సరోజను తాను చంపలేదు. ఆమె ఆత్మహత్యకు కారణం! ఆమే! ఆమెను ఆమే చంపుకుంది నిజాన్ని దాచలేక, తనతో చెప్పలేక. ఆమె బలహీనతకు తను కాదు బాధ్యుడు' అనుకున్నాడు రవిప్రసాదు కుడిచేతి మునివ్రేళ్ళతో గడ్డాన్ని స్పృశించుకుంటూ. (నెలవంక)

—o—